నమస్తే తెలంగాణ

మహబూబ్‌నగర్ నారాయణపేట

10 | మహబూబ్‌నగర్, ఆదివారం 12 మే 2024 | MAHABUBNAGAR NARAYANPET

ప్రచారంలో భాగంగా మహిళలతో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ర్యాలీగా వెళ్తున్న ఎంపీ అభ్యర్థిని వాస్‌రెడ్డి, చిత్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఆరు నెలల్లోనే ఆగమాగం

- బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి : ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, మే 11 : కేసీఆర్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందితే.. ఆరు నెలల కాంగ్రెస్ పాలనలో ఆగమైందని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని 12, 27, 28, 36, 37 వార్డుల్లో బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఎర్రమట్టి వీధిలోని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు, రాఘవేంద్రస్వామి ఆలయంలో పూజలు చేసి వార్డుల్లో కలియ తిరిగారు. ఆయా వార్డుల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాయమాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. అభివృద్ధి జరగాలంటే బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకోవాలని సూచించారు. కేసీఆర్ పాలనలో ఇతర దేశాలు తెలంగాణ వైపు చూశాయన్నారు. మతం, రాముడి పేరుతో బీజేపీ ఓట్లు దండుకోవడానికి చూస్తున్నదన్నారు. వారి పాలనలో నిత్యావసర ధరలు పెరిగి, ప్రజలు ఏమీ కొనలేని పరిస్థితి నెలకొన్నదన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి సామాన్యుడిపై భారం మోపారన్నారు. అటువంటి వారికి పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బాబర్, కౌన్సిలర్ మురళి, దౌలు, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, వేణుగోపాల్, గోవిందు, వంశీ, సీతారాములు, రఘు, రమేశ్, రాజు, దేవన్న, సత్యం రెడ్డి, సూర్యప్రకాశ్, గాంధీ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ఓటేయాలని చేతులెత్తి మొక్కుతున్న నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు

ప్రజల మద్దతు కోల్పోయిన సర్కారు

- అక్రమకేసు లతోభయ బ్రాంతులకుగు రిచే స్తున్న కాంగ్రెస్ నేతలు
- ప్రజలకుపో రాటాలు కొత్తేమీ కాదు : గువ్వల బాలరాజు

అచ్చంపేట టౌన్, మే 11 : జాతీయ పార్టీలను ప్రశ్నించే దమ్ము కేసీఆర్‌కే ఉన్నదని.. అందుకే ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్ పార్టీలో చేరారని బీఆర్ఎస్ పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు పేర్కొన్నారు. శనివారం అచ్చంపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ అభ్యర్థిగా ఆర్ఎస్పీని గెలిపిస్తే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ రూపురేఖలు మారుస్తారన్నారు. ఆర్ఎస్పీ పాల్గొంటున్న సభలకు ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తున్నదన్నారు. ఈ ప్రాంతంలో ఇసుక, మైనింగ్ మాఫియా చెలరేగుతున్నదని.. ప్రజలు, ఇతర పార్టీల నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ భయభ్రాంతులకు గురిచేసిన కాంగ్రెసోళ్లు ప్రజల మద్దతును కోల్పోయారన్నారు. ఈ ప్రాంత ప్రజలకు పోరాటాలు కొత్తేమీ కాదని.. అందువల్లే వారిని మభ్యపెట్టేందుకు ఆరు గ్యారెంటీల చర్చను దారి మళ్లించేందుకు సర్కారు ప్రయత్నిస్తున్నదన్నారు. ఐదేండ్లు మేం ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లు ఇసుకను అక్రమంగా అమ్ముకొని ఆర్థికంగా ఎదిగి మళ్లీ తామే అధికారంలోకి వస్తామనే ధీమాతో ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతుందన్నారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని.. కోల్పోయిన నాయకత్వాన్ని తిరిగి తెచ్చుకోవాలని ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. అచ్చంపేటలో నిర్వహించిన కేటీఆర్ రోడ్ షోకు హాజరైన జనాన్ని చూస్తే ప్రజలు మార్పును కోరుకుంటున్నారని తెలిసిపోయిందన్నారు. మన అభివృద్ధి కోసం పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక ఉండాలంటే కారు గుర్తుకు ఓటేసి ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్, నాయకులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విలేకరులస మావేశంలో మాట్లాడుతున్నమా జీ ఎంపీ మందజ గన్నాథం, చిత్రంలో ఎమ్మెల్యే బండ్ల

వాస్తవాలు చెప్పే వారికే ఓటేయాలి

- నా కుమారుడికిటి కెట్ ఇవ్వలేదనేపా ర్టీ మారాను..
- కాంగ్రెస్ సర్కారుత్వ రలోనేపడి పోతుంది..
- ఢిల్లీ నుంచి గల్లీ వరకు వాళ్లు చెప్పేవన్నీ అబద్ధాలే..
- ప్రభుత్వంలో నాయకత్వలో పం ఉంది : మందజ గన్నాథం

గద్వాల, మే 11 : అబద్ధపు హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రజాపాలనలో పూర్తిగా విఫలమైందని మాజీ ఎంపీ మంద జగన్నాథం ఆరోపించారు. శనివారం గద్వాల క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమ కుమారుడికి బీఆర్ఎస్ నుంచి అలంపూర్ టికెట్ ఇవ్వకపోవడంతో మనస్థాపానికి గురై పార్టీ మారినట్లు చెప్పారు. 'నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బరిలో నిలిచిన మల్లు రవి స్థానికేతరుడు.. బీజేపీ నుంచి బరిలో నిల్చున్న వ్యక్తికి ప్రజా సమస్యలపై అవగాహనే లేదు.. అటువంటి వారిని గెలిపిస్తే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాలు అభివృద్ధి చెందే అవకాశమే లేదు' అని అన్నారు. ప్రతిభావంతుడు, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించుకుంటే ఇక్కడి సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించే అవకాశం ఉంటుందన్నారు. వాస్తవాలు చెప్పే వ్యక్తులకే ప్రజలు ఓటేయాలని సూచించారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, కాంగ్రెస్‌లో నాయకత్వ లోపం ఉందని చెప్పారు. రాష్ట్రాన్ని రాష్ట్రంలో ఉన్న వనరులను సమకూర్చుకోవడంలో సీఎం రేవంత్ పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఎంపీ ఎన్నికల్లో ప్రచారానికి వెళ్లిన మంత్రులను హామీల అమలుపై ప్రజలు నిలదీస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ నుంచి గల్లీ వరకు అబద్ధాలు చెప్పి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారన్నారు. కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయని గుర్తు చేశారు. కేసీఆర్ రైతుబంధు కోసం ఉంచిన నిధులను రేవంత్ సర్కార్ తన కొలువులో ఉన్న మంత్రుల కాంట్రాక్ట్ బిల్లులు చెల్లించారని ఆరోపించారు. ఆ పార్టీలో ఎవరికీ నైతిక విలువలు లేవని, ప్రభుత్వం త్వరలోనే పడిపోతుందని చెప్పారు. తమ పార్టీ ఎన్ని రోజులు అధికారంలో ఉంటుందో అనే అయోమయంలో కాంగ్రెస్ మంత్రులు ఉన్నారన్నారు. ఎంపీ సీట్లలో కాంగ్రెస్ మాదిగలకు అన్యాయం చేసిందని ఆరోపించారు. అధికారంలోకి వస్తే వర్గీకరణ చేస్తామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే చెబుతున్నాడు.. వర్గీకరణకు కాంగ్రెస్సే అడ్డంకి అని స్పష్టం చేశారు. జాతీయ పార్టీల నాయకులు చెప్పే మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని.. 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు అండగా నిలవాలని సూచించారు. సమావేశంలో నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, పటేల్‌ప్రభాకర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, మురళి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా మద్యం అమ్మకాలు

- పది రోజుల్లో రూ.66.53 కోట్లు..
- శుక్ర, శనివారాల్లో రూ.22.29 కోట్లవిక్ర యాలు

తిమ్మాజిపేట, మే 11 : ఎన్నికల నేపథ్యంలో మద్యం అమ్మకాలు జోరందుకున్నాయి. తిమ్మాజిపేట టీఎస్‌బీఎస్‌ఎల్ స్టాక్ పాయింట్‌లో పది రోజుల్లో మద్యం అమ్మకాలు రూ.కోట్లు దాటాయి. ఉమ్మడి జిల్లా పరిధిలోని సగం (153 దుకాణాలు, 20 బార్లు) దుకాణాల్లో ఈ నెల ఒకటి నుంచి శనివారం వరకు రూ.66.53 కోట్ల విక్రయం జరిగింది. ఏఎంఎల్ 73,800 కేసులు, బీర్లు 72,800 కేసులు అమ్ముడుపోయాయి. రేషన్ పద్ధతిలో ఇస్తుండగానే ఇంత అమ్మకాలు జరిగాయి. కాగా శుక్ర, శనివారాల్లో రూ.22.29 కోట్ల విక్రయాలు జరిగాయి. సాధారణంగా నెలలో రూ.150 కోట్ల దాకా అమ్మకాలు జరుగుతుంటాయి. ఎన్నికల నేపథ్యంలో అమ్మకాలు పెరిగినట్లు స్టాక్ పాయింట్ వర్గాలు తెలిపాయి.



అంతా సైలెంట్

- సెంటర్ల వద్ద సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా
- అన్ని కేంద్రాల్లో రెండు ఈవీఎంలు..
- మద్యం మత్తులో పల్లెలు, పట్టణాలు!

మహబూబ్‌నగర్, మే 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి తెర పడింది. కాగా ఎన్నికలకు కౌంట్ డౌన్ షురూ అయ్యింది. మరో 24 గంటల్లో ఎంపీ ఎన్నికలు జరుగనుండగా సర్వం సిద్ధమైంది. పాలమూరు, కందనూలు లోక్‌సభ పరిధిలో ఆయా జిల్లాల అధికారయంత్రాంగం ఎన్నికలకు ఏర్పాట్లు చేసింది. ఆదివారం మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రాల్లో ఎన్నికల సామగ్రిని పంపిణీ చేయనున్నారు. రెండు లోక్‌సభల పరిధిలో రెండేసి ఈవీఎంలు వాడనున్నారు. మహబూబ్‌నగర్‌లో 31 మంది అభ్యర్థులు, నాగర్‌కర్నూల్‌లో 19మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు . నామినేషన్ల ఘట్టం ప్రారంభం అయినప్పటి నుంచి అభ్యర్థులు పల్లెలు, పట్టణాలను ప్రచారాలతో హోరెత్తించారు. శనివారం సాయంత్రం ఐదు గంటలకు ప్రచారం ముగియగా.. అభ్యర్థులు ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. పోలింగ్‌కు 24 గంటలే ఉండడంతో ఆయా పార్టీలు ఓటర్లను మద్యం మత్తులో ముంచెత్తుతున్నారు. ఈక్రమంలో బాలానగర్ సమీపంలో మద్యం లారీ పట్టుబడడం సంచలనం రేపింది. ఈ మద్యాన్ని గోవా నుంచి ఆంధ్రాకు తరలిస్తున్నట్లు సమాచారం.

సర్వం సిద్ధం..

ఉమ్మడి జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాలకు సోమవారం ఉదయం ఏడు నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగనున్నది. మహబూబ్‌నగర్ లోక్‌సభలో 1,937 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. నాగర్‌కర్నూల్ లోక్‌సభ పరిధిలో 1,944 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఆయా రిటర్నింగ్ అధికారులు, కేంద్ర ఎన్నికల సంఘం నుంచి వచ్చిన అబ్జర్వర్లు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఓటర్లు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. వివిధ వర్గాలకు సంబంధించి ప్రత్యేక పోలింగ్ కేంద్రాలతోపాటు మోడల్ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈసారి ఎండలు ఎక్కువగా ఉండడంతో పోలింగ్ సమయాన్ని ఆరుగంటలకు పెంచారు.

సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు..

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ లోక్‌సభ పరిధిలోని అన్ని కేంద్రాలకు పోలింగ్ సామగ్రిని పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఆయా జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్లలో పోలింగ్ సామగ్రిని కేంద్రాలకు తరలించేందుకు సిద్ధం చేస్తున్నారు. ఈవీఎంలు, ఇతర సామగ్రిని భారీ బందోబస్తు మధ్య కేంద్రాలకు తరలించనున్నారు. సిబ్బందిని సైతం ఆయా కేంద్రాలకు తరలించి అక్కడే ఉండేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద మంచినీటి వసతి, టెంట్లు, ఓటర్లకు కావాల్సిన ప్రాథమిక సౌకర్యాలను కల్పించారు. ప్రత్యేక నిఘాతో పాటు వెబ్ కెమెరాలతో పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు. మరోవైపు ఆయా లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో పోలీసు యంత్రాంగం భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది.

- ఎంపీ ఎన్నికలకు ఏర్పాట్లు చేసిన అధికారులు
- పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు

పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నాగర్‌కర్నూల్ సెగ్మెంట్		మహబూబ్‌నగర్ సెగ్మెంట్	
ఓటర్లు	17,38,254	ఓటర్లు	16,80,417
పురుషులు	8,64,875	పురుషులు	8,32, 080
స్త్రీలు	8,73,340	స్త్రీలు	8,48, 293
ట్రాన్స్‌జెండర్స్	39	ట్రాన్స్‌జెండర్స్	44
పోలింగ్ స్టేషన్లు	1,944	పోలింగ్ స్టేషన్లు	1,937

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

- వలసల నుంచి ఉపాధినిచ్చేస్థా యికితీ సుకొచ్చాం..
- పాలమూరు ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి
- విమర్శలుమా నండి : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, మే 11 : 'మహబూబ్‌నగర్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం.. కాదనే కాంగ్రెస్, బీజేపీ నాయకులు ముందుకొస్తే క్లాక్‌టవర్ చౌరస్తాలో చర్చకు నేను సిద్ధంగా ఉన్నా' అని బీఆర్ఎస్ పాలమూరు ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి సవాల్ విసిరారు. జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ చౌరస్తాలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి రోడ్ షోలో పాల్గొని మాట్లాడారు. ముందుగా కూరగాయల మార్కెట్‌లో వ్యాపారస్తులను కలిసి కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. అనంతరం మన్నె మాట్లాడుతూ 2014కు ముందు పాలమూరులో తాగడానికి నీళ్లు కూడా దొరికేవి కాదని.. మోకాళ్లలోతు మట్టి గుంతలతో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉండేదన్నారు. అలాంటి దీనస్థితిలో ఉన్న మనం కేసీఆర్ పోరాట పటిమతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి హామీలు అమలు చేసేందుకు ఐదు నెలల సమయమిచ్చినా ఫలితం లేకపోయిందన్నారు. అభివృద్ధి, హామీలపై వారికి సోయేలేదని విమర్శించారు. తనను ఓడించేందుకు బీజేపీ, కాంగ్రెస్ ఒకటయ్యాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే పనులు ఒక్కటీ చేయలేదని గుర్తుచేశారు.

తప్పుడు ప్రచారంతో గెలిచారు : శ్రీనివాస్‌గౌడ్

'పాలమూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తే.. ఓర్వలేని కొందరు నేను భూ కబ్జాలు చేస్తున్నానని.. కేసులు పెట్టారు. మాపై తప్పుడు ప్రచారం చేసి ఎన్నికల్లో గెలిచారు. అధికారం చేపట్టాక ప్రజలకు ఏం చేశారో చెప్పాలని అడుగుతుంటే వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారు తప్పా.. అభివృద్ధి గురించి మాట్లాడడం లేదు.' అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. ప్రతిపక్షాలపై విమర్శలు మాని జిల్లా అభివృద్ధి గురించి ఆలోచించాలని సూచించారు. అండర్ గ్రౌండ్ డైనేజీ పనులు చేసి, ఉద్యోగాలు కల్పించాలని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీలన్నారు.. ఉచిత గ్యాస్, ఉచిత కరెంట్ ఏమయ్యాయి? పింఛన్లు, రైతుబంధు, రైతు బీమా అమలు చేశారా? సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేసి గెలిచారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ 50 ఏండ్లు వెనక్కి నెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ దేవుళ్ల పేరుతో రాజకీయం చేస్తోందని, కాంగ్రెస్ పార్టీ మరోమారు మోసం చేయడానికి సిద్ధమైందని దుయ్యబట్టారు.

కారు గుర్తుకు ఓటేయాలని కోరుతున్న ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బైక్‌ర్యాలీకి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు

రోడ్‌షో అదుర్స్

- గులాబీవనమైనక ందనూలు
- కొల్లాపూర్ చౌరస్తా నుంచి ఉయ్యాలవాడకు వరకు బైక్ ర్యాలీ
- భారీగాతర లొచ్చినపా ర్టీశ్రేణులు
- 'కారు'కుఓ టేయాలి:ఆ ర్ఎస్పీ
- హాజరైనమా జీ ఎమ్మెల్యే మర్రి

నాగర్‌కర్నూల్, మే 11 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం గులాబీమయమైంది. శనివారం పట్టణంలో బీఆర్ఎస్ నిర్వహించిన రోడ్‌షో అట్టహాసంగా సాగింది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో చివరి రోజు కావడంతో కొల్లాపూర్ చౌరస్తా నుంచి ఉయ్యాలవాడ వరకు భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. జై బీఆర్ఎస్.. జైజై కేసీఆర్ అన్న నినాదాలు మార్మోగాయి. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, ముఖ్య నాయకులు నాగం శశిధర్‌రెడ్డి, అభిలాశ్‌రావుతో కలిసి ఆర్ఎస్ ప్రవీణ్ ప్రచార రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేశారు.

పదేండ్ల అభివృద్ధిని చూసి ఆదరించాలి : ఆర్ఎస్పీ

కేసీఆర్ ప్రభుత్వం పదేండ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి బీఆర్ఎస్‌ను ఆదరించాలని నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల మాయమాటలు నమ్మితే మరోసారి గోస తప్పదని హెచ్చరించారు. రేవంత్ సర్కారు ఆరు గ్యారెంటీల పేరుతో గారడీ చేసి ప్రజలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అమలుకు సాధ్యం కాని హామీలు గుప్పించి గద్దెనెక్కిన తర్వాత ప్రజలు, రైతులను విస్మరించిందని దుయ్యబట్టారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు కావడం లేదన్నారు. ముఖ్యంగా రైతులకు రుణమాఫీ ఊసెత్తడం లేదని, రైతుబంధు అంతంత మాత్రంగానే జమైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. కల్యాణలక్ష్మి పథకంలో భాగంగా రూ.లక్ష సాయంతోపాటు తులం బంగారం ఎక్కడ అని ప్రశ్నించారు. మీరిచ్చిన హామీల్లో ఒక్కటైనా ప్రజలకు అందిందా అని నిలదీశారు. ఈ విషయాన్ని ఆ పార్టీ నాయకులను ఎక్కడికక్కడే నిలదీయాలని సూచించారు. మర్రి జనార్దన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో నాగర్‌కర్నూల్‌ను సుందరంగా తీర్చిదిద్దారని, ఇప్పుడేమో కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించి తప్పుచేశామని ప్రజలే బాధపడుతున్నారని తెలిపారు. అంతకుముందు బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మర్రితో కలిసి ఆర్ఎస్పీ మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటువేయవద్దన్నారు. వనపర్తి, గద్వాల జిల్లాలను రద్దు చేయాలని ప్రభుత్వం చేస్తున్న కుట్రను ఖండించారు. జిల్లాలను రద్దు చేస్తే ప్రజలతో కలిసి ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసి బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రిజర్వేషన్లను తొలగిస్తుందన్నారు. సమావేశంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సోషల్ మీడియా ఇన్‌చార్జి అభిలాశ్‌రావు, ముఖ్య నాయకులు నాగం శశిధర్‌రెడ్డితోపాటు పలువురు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీకి బుద్ధి చెప్పాలి : మర్రి

ఎన్నికల సమయంలో గ్యారెంటీల పేరుతో ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ సర్కారు చేసిన నిర్వాకంతో జనం, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో మోసకారి కాంగ్రెస్‌తోపాటు మతాల మధ్య చిచ్చుపెట్టే బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి కోరారు. రేవంత్ మాటలకు మరోసారి మోసపోవద్దని, బీఆర్ఎస్ అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. కేసీఆర్ చేసిన మంచి పనులను చూసి మరోసారి తప్పటడుగు వేయకుండా కారుకు బ్రహ్మరథం పట్టాలని కోరారు.

మోసగించే పార్టీ.. కాంగ్రెస్

కొల్లాపూర్ రూరల్, మే 11 : దొంగ హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్‌కు.. ఎంపీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి కొల్లాపూర్‌లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సింగోటం చౌరస్తా నుంచి పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగగా దారి పొడవునా జై కేసీఆర్.. జై బీరం.. జై ఆర్ఎస్పీ నినాదాలతో హోరెత్తింది. ఈ సందర్భంగా ఆర్ఎస్పీ మాట్లాడుతూ తప్పుడు పద్ధతిలో మంత్రి జూపల్లి గ్రామాల్లో తన శాఖ తరపున మద్యం బాటిళ్లు దింపారని.. బీరు బాటిళ్లతో పిల్లల భవిష్యత్తును నాశనం చేస్తున్నారని ఆరోపించారు. తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బీరం మాట్లాడుతూ విద్యావంతుడైన ప్రవీణ్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు కాలేదన్నారు. రైతుల రుణమాఫీ, రైతుబంధు, రైతుబీమా హామీలను కాంగ్రెస్ గాలికొదిలేసిందన్నారు. అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రంగినేని అభిలాష్‌రావు మాట్లాడారు. ర్యాలీలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, చిత్రంలో నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్పీ

ప్రశ్నించే గొంతుకను గెలిపిద్దాం

- రెండు తరాలకు సరిపడా అభివృద్ధి చేసుకున్నాం.. : మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, పెబ్బేరులో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

వనపర్తి/పెబ్బేరు, మే 11 : లోక్‌సభ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకైన ఆర్ఎస్పీని గెలిపించుకుందామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం వనపర్తిలోని గాంధీచౌక్, అంబేద్కర్ చౌరస్తా, సంతబజార్, పీర్లగుట్ట, చందాపూర్ రోడ్డు, రామాలయం వరకు బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలతో కలిసి ర్యాలీ చేపట్టారు. అలాగే పెబ్బేరు మండలంలోని పెబ్బేరు, చెలిమిల్ల, కంచిరావుపల్లిలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జిల్లాలో రెండు తరాలకు సరిపడా అభివృద్ధి చేసుకున్నామన్నారు. ఇతర దేశాలు తెలంగాణ వైపు చూసేలా కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారన్నారు. బీఆర్ఎస్ అధినేత చేపట్టిన బస్సుయాత్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటై కేసీఆర్‌పై కుట్రలు చేశారని.. ఆయనను ఓడగొట్టి పొరపాటు చేశామనే భావన ప్రజల్లో వచ్చిందన్నారు. ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేక ప్రజలను ఆరు లోకాలు తిప్పుతూ అరిగోస పెడుతున్నదన్నారు. అధికారం కోసం ప్రజలకు ఎన్నో ఆశలు చూపిందన్నారు. హామీలను గాలికొదిలేసి ఎంపీ ఎన్నికల్లో ఓట్లడిగేందుకు ఏ ముఖం పెట్టుకొని వస్తున్నారని ప్రశ్నించారు. సీఎం ఎక్కడికెళ్లినా దేవుళ్లపై ఒట్లు వేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ మాటలు నమొద్దన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ చేసిన బూటకపు వాగ్దానాలను ఒకసారి గుర్తు చేసుకొని ఓటు వేయాలని సూచించారు. ప్రవీణ్‌కుమార్ ఉన్నతస్థాయి అధికారిగా పనిచేశాడని, ఆయన గెలిస్తే పార్లమెంట్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. నెలరోజులుగా ప్రచారంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్, గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ లక్ష్మయ్య, పట్టణ అధ్యక్